క్లుప్తంగా

డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయాలి

జడ్చర్ల: నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే అర్హులయిన వారికి పంపిణీ చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎర్ర శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎర్రగుట్ట వద్ద నిర్మించిన ఇళ్లను పరిశీలించారు. ఇళ్లు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయని, అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయన్నారు. నిమ్మబాయిగడ్డ వద్ద కాంగ్రెస్ హయాంలో రూ.50 లక్షలతో నిర్మించిన ఉర్దూ ఘర్ షాదీఖానాపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరీని కలిసి వినతిపత్రం ఇచ్చారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

అడ్డాకుల: మద్యం తాగి వాహనాలు నడపరాదని సీఐ రజితారెడ్డి సూచించారు. మండలంలోని జాతీయ రహదారిపై శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం సాయంత్రం ఆమె తనిఖీ చేపట్టారు. ద్విచక్రవాహనదారులు, ఆటో డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడపరాదని తెలిపారు. కారులో ప్రయాణించే వారు తప్పకుండా సీటు బెల్టు పెట్టుకోవాలని చెప్పారు. అతివేగంతో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్సీ సెల్ కమిటీ ఎన్నిక

చిన్నచింతకుంట: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా ఉంద్యాలకు చెందిన వెంకటేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు సాయిబాబ నియామకపత్రం అందించినట్లు ఆయన తెలిపారు. నావంతుగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

3న మూసాపేట మండల సభ

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రైతువేదికలో 3న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ స్వరూప ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కళావతి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండలంలోని సభ్యులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

తైబజారు వేలం



అడ్డాకుల: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో 2023–24వ సంవత్సరానికి సంబంధించిన తైబజారు వేలం శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ మంజుల అధ్యక్షతన వేలం నిర్వహించగా ఎంపీటీ విజయకుమారి హాజరయ్యారు. రూ.22.05లక్షలకు తైబజారును యాకూబ్ దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రంగన్నగౌడ్, కార్యదర్శి నగేష్, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

నేడు ప్రభోత్సవం

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి సప్తాహ మహోత్సవాలలో భాగంగా శనివారం తెల్లవారుజామున 4గంటలకు స్వామి ప్రభోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఆదివారం నుంచి అఖండ భజనలు, అఖండ దీపారాధన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున రథోత్సవం నిర్వహించారు. దేవాలయాలను విద్యుత్ దీపాల అలంకరణతో పాటు మంగళతోరణాలతో అలంకరించారు.

పశువుల సంత వేలం

మిడ్జిల్: మండల కేంద్రంలోని పశువుల సంతకు 2023–24గాను శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించారు. రూ.10లక్షలకు మండల కేంద్రానికి కుర్వ సత్యం దక్కించుకున్నారు. పంచాయతీ నిర్ణయించిన ధరలు మాత్రమే సంతలో వసూలు చేయాలని తీర్మానించారు. కూరగాయల సంత వేలం నిలిపివేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధిక, కార్యదర్శి సాయన్న పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

దేవరకద్ర: మండలంలోని గూరకొండకు చెందిన లక్ష్మీనారాయణకు చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం అన్నాసాగర్‌లో కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌యాదవ్, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

మహబూబ్‌నగర్ రూరల్: పట్టణానికి చెందిన మాణిక్యం శ్రీనివాస్ మెడికల్ షాపు, ఏజెన్సీలో పని చేస్తున్న పానుగంటి సాయినాథ్‌పై అకారణంగా దాడికి పాల్పడి కులం పేరుతో దూషించాడని ఎమ్మార్పీఎస్ – టీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక టీఎన్జీఓ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మాణిక్యం శ్రీనివాస్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి సాయినాథ్‌కు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సాయినాథ్, యాదగిరి, సాయికుమార్, జయన్న తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ మరింత అభివృద్ధి

- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి
- భూత్పూర్ మున్సిపాలిటీ 2023–24 ఆర్థిక బడ్జెట్ రూ.11కోట్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో మున్సిపల్ బడ్జెట్ సమావేశం చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించగా, సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ 2023–24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూ.11కోట్లలక్షా50వేలు రూపొందించగా కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. రూ.2కోట్ల40 లక్షలు పన్ను రాబడి, రూ.6 కోట్ల69లక్షల95వేలు పన్నేతర రాబడిగా రూపొందించారు. రూ.91లక్షల55వేలు మిగులు బడ్జెట్ కాగా, పారిశుద్ధ్య నిర్వహణ ఖర్చు రూ.కోటీ47 లక్షల20వేలు, విద్యుత్ ఖర్చులు రూ.11 లక్షలు కేటాయించారు. హరిత హారం పనులకు రూ. కోటి2లక్షల89వేలు, చార్జ్‌డ్ వ్యయాలకు రూ.3కోట్ల46లక్షల9వేలు, ఇతర నిర్వహణ ఖర్చు రూ.3కోట్లు39లక్షల59వేలు కేటాయించారు. బడ్జెట్ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీలకు కేంద్రం ప్రభుత్వం 20 అవార్డుల్లో తెలంగాణకు 19 అవార్డులు రావడం గర్వకారణమన్నారు. నియోజకవర్గంలో భూత్పూర్, కొత్తకోట మున్సిపాలిటీలు అందులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా చైర్మన్, కమిషనర్ నజీబ్, సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో రూ.32 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, మున్సిపల్ పరిధిలోని 288 డబుల్ బెడ్‌రూం ఇళ్లు పేదలకు అందించడం, రూ.3కోట్లతో స్టేడియం నిర్మాణం, వెజ్ నాన్‌వెజ్ మార్కెట్‌కు శంకుస్థాపన చేశామని ఎమ్మెల్యే తెలిపారు. భూత్పూర్ చౌరస్తా నుంచి అమిస్తాపూర్ వరకు సెంట్రల్ లైటింగ్, పట్టణంలో చెరువు కట్టను సుందరంగా అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ చెన్న కిష్టన్న, మేనేజర్ అశోక్‌రెడ్డి, కౌన్సిలర్లు నాగమ్మ, కృష్ణవేణి, శ్రీనివాస్ రెడ్డి, బాలకోటి, జాకీర్, అజీజ్ తదితరులు ఉన్నారు.

కమీషన్ల కోసమే ప్రాజెక్టుల నిర్మాణం



తాటిపర్తిలో ప్రజలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

భూత్పూర్: కమీషన్ల కోసమే ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతున్నారని టీపీసీసీ సంయుక్త కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని తాటిపర్తి, కప్పెటలో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా తిరిగి పార్టీ చేపట్టబోయే కార్యక్రమాల కరపత్రాలను అందజేశారు. నిత్యవసర ధరలు, గ్యాస్ సిలిండర్ ధర పెంపు, ఆరోగ్య శ్రీ పథకం తదితర అంశాల గురించి ప్రజలకు వివరించారు. సీఎం కేసీఆర్ పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేస్తామని, కట్టపైనే కుర్చీ వేసుకొని పూర్తయ్యే వరకు ఉంటానని చెప్పి మోసం చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్లు కేటాయించి పూర్తి చేశారని, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిందని, రాష్ట్రంలో మళ్లీ పార్టీ అధికారంలోకి వస్తే పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాధాకృష్ణారెడ్డి, వేణుగోపాల్, ఎంపీటీసీ పుల్లయ్య, గోవర్ధన్‌గౌడ్, ఫసియొద్దీన్, ప్రదీప్ రావు, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసం కృషి



మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య

జడ్చర్ల: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తుందని జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య తెలిపారు. శుక్రవారం బాదేపల్లి సహకార సంఘం మహాజన సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. రైతులకు గిట్టుబాటు ధర లభించే విధంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు.

అల్‌ఫైజ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని సద్దల్‌గుండ్‌లో అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా తన నివాసంలో శుక్రవారం రాత్రి రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మజీద్ బా అబ్దుల్లా ఇమామ్ ముఫ్తి మహ్మద్ ముబారక్ ప్రత్యేక దువా చేశారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు రహెమాన్ సోఫి, కార్యదర్శి మహ్మద్ యాఖూబ్, ఖవి, మహమూద్, అలీం, దస్తగీర్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

బార్ అసోసియేషన్ ఎన్నిక

జడ్చర్ల టౌన్: బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా విశ్వేశ్వర్ ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి తిరుపతి ప్రకటించారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో ఎన్నికలో ప్రధాన కార్యదర్శిగా శివకుమార్, ఉపాధ్యక్షుడిగా శంకరాచారి, గ్రంథాలయ కార్యదర్శిగా నర్సింహులు, కార్యదర్శిగా రాములు, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శిగా అమీనోద్దీన్, కార్యవర్గ సభ్యులుగా సత్యం, శ్రీశైలం, శ్రీనివాసులు ఎన్నికైనట్లు ప్రకటించారు. అసోసియేషన్ అభివృద్ధికి తమ కార్యవర్గం పాటుపడుతుందని తెలిపారు.

వైద్య సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ



కోయిల్‌కొండలో అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

కోయిల్‌కొండ: మండల కేంద్రంతో పాటు కోత్లాబాద్, మనికొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేసే వైద్య సిబ్బందికి శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో సీపీఆర్ చికిత్సపై శిక్షణ ఇచ్చారు. డీఎంహెచ్‌ఓ కృష్ణ అవగాహన కల్పించారు. అత్యవసర రోగులకు అంబులెన్స్ వచ్చేలోపు ఏవిధంగా సీపీఆర్ చేయాలి అనేదానిపై పూర్తి అవగాహన ఇచ్చామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్, వైస్ ఎంపీపీ కృష్ణయ్య, వైద్యులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంలో వైద్య సిబ్బందికి శుక్రవారం సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చినట్లు మండల వైద్యాధికారి విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శకుంతల, రాఘవేందర్, శరభలింగం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డున పడ్డ నిరుద్యోగులు

భూత్పూర్: ప్రత్యేక రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయనుకున్న యువత నేడు ఉద్యోగం, ఉపాధి లేక రోడ్ల పాలవుతున్నారని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు మండడి సరోజ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భూత్పూర్‌చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో ఉద్దేశపూర్వకంగానే ఉద్యోగాలు ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో ఆనంద్‌నాయక్, యాదయ్య, మహేందర్, అభిషేక్ యాదవ్, భాస్కర్, ఆంజనేయులు ఇక్బాల్ ఆదిల్ తదితరులు ఉన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నాయకులను అరెస్ట్ చేయాలి

కోయిల్‌కొండ: మండలంలోని వింజామూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టింది అదే గ్రామానికి చెందిన ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నాయకులేనని, తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు స్కైలాబ్‌బాబు, వెంకట్రాములు డిమాండ్ చేశారు. వారు గ్రామంలోని నిప్పు పెట్టిన అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ముసుగు ధరించి ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి గ్రామ ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీశారన్నారు. విగ్రహాన్ని గ్రామంలో నెలకొల్పడం జీర్ణించుకోలేక ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ దుష్టశక్తులు కుట్రపన్నాయని అన్నారు. దళితుల ఎదుగుదలను ఓర్వలేక అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టారని విమర్శించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో రఘునాథ్, మోహన్, ఆదివిష్ణు, భరత్, వేణు, తిరుమలయ్య, శ్రీను, హనుమంతు, పాండు, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ నాయకులు

పోషకాహారంపై అవగాహన

జడ్చర్ల టౌన్: మండలంలోని ఆలూరులో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిరుధాన్యాలు, పోషకాహారంపై సర్పంచ్ సుకన్య అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు తినటం వల్ల ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, అంగన్‌వాడీ టీచర్స్ యాదమ్మ, సరళ, తిరుపతమ్మ, శారద, సోని పాల్గొన్నారు.


బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డు దాటుతున్న వ్యక్తిని బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. టూటౌన్ ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోయిలకొండకు చెందిన రాములు మార్చి 26న జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ గుడి దగ్గర రోడ్డుదాటుతుంటే అంబేడ్కర్ చౌరస్తా నుంచి న్యూటౌన్ వైపు వెళ్లే ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. రాములుకు కుడి కాలు, కుడి చెయ్యి, ముఖానికి తీవ్ర గాయాలు అయ్యాయి. అతనిని చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం క్షతగాత్రుడి భార్య భీమమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహ్మద్ యూసుఫ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

‘పత్తి మార్కెట్ రోడ్డును బదలాయించం’

జడ్చర్ల: పట్టణంలోని పత్తి మార్కెట్ యార్డుకు వెళ్లే ప్రధాన రహదారిని మరో పక్కకు బదలాయించడానికి వీలు లేదని మార్కెట్ యార్డు పాలకమండలి ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు కార్యదర్శి నవీన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం యార్డు కార్యాలయంలో చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పాలక మండలి సర్వ సభ్య సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పత్తి మార్కెట్ యార్డుకు వెళ్లే ప్రధాన సీసీ రోడ్డుకు సంబంధించి దాదాపు 3.5 ఎకరాలను గతంలో దానం ఇచ్చిన వ్యక్తి తిరిగి వెనక్కి తీసుకునేందుకు ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో పాలక మండలి ఉన్నతాధికారుల నిర్ణయానికి వ్యతిరేకంగా తీర్మానం చేశారు. ప్రస్తుతం ఉన్న సీసీ రోడ్డును ధ్వంసం చేసి మరో పక్కగా డీటీసీపీ లేఅవుట్ వెంచర్‌లో గల రోడ్డును మార్కెట్‌కు వినియోగించుకోవాలని స్థల దాత కోరుతున్నారు. అయితే కొత్తగా మరో పక్క సీసీ రోడ్డు నిర్మించాలంటే రూ.2.48 కోట్లు అవసరం అవుతాయని, నిధులు తిరిగి ప్రభుత్వం భరించాల్సి ఉంటుందని అధికారులు చెబుతుండడం గమనార్హం.

స్వచ్ఛ మహోత్సవం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో స్వచ్ఛ మహోత్సవం కొనసాగుతుంది. శుక్రవారం 5, 6వ వార్డుల్లో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు ఆయా వీధుల్లో తిరిగి ప్రచారం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, కౌన్సిలర్ ప్రవీణ్‌కుమార్, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాజులపేటలో పేకాట స్థావరంపై దాడి

మహబూబ్‌నగర్ క్రైం: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గాజులపేట శివారులో శుక్రవారం కొందరు పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో దాడులు చేశారు. మొత్తం 15 మంది పేకాట ఆడుతుండగా, 8మందిని అదుపులోకి తీసుకోగా, మరో ఏడుగురు పరారైనట్లు తెలిపారు. వారి నుంచి రూ.38,500నగదు, మూడు బైకులు, ఆరు సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

పాత పాలమూరులో తనిఖీలు



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్ క్రైం: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత పాలమూరులో శుక్రవారం రాత్రి కమ్యూనిటీ కనెక్టెడ్‌లో భాగంగా 20మంది పోలీస్ సిబ్బంది ఇళ్ల తనిఖీ నిర్వహించారు. మొత్తం 114ఇళ్లను పరిశీలించి వాటిలో నివాసం ఉంటున్న వారి వివరాలు, ఆధార్‌కార్డులు పరిశీలించారు. కొత్తగా ఎవరైనా అద్దెకు వచ్చిన వారితో పాటు ఆ ఏరియాలో కొత్త వ్యక్తుల కదలికలపై ఆరా తీశారు. ఈ క్రమంలో 52 ద్విచక్ర వాహనాలు, ఆరు కార్లకు సంబంధించిన పత్రాలు పరిశీలించారు.

సమ్మేళనానికి కుటుంబ సమేతంగా రావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నవాబుపేట: ఆత్మీయ సమ్మేళనానికి ప్రతి కార్యకర్త తమ కుటుంబంతో కలిసి రావాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మైసమ్మ దేవాలయ ఆవరణలో బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 3వ తేదీని మండలంలోని 23 గ్రామాల బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం రాజాపూర్ రోడ్డులోని ముదిరెడ్డిపల్లి సమీపంలో ఉంటుందని తెలిపారు. కార్యకర్తల కోసం నిరంతరం అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు. సమావేశంలో నర్సింహులు, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడా లేని పథకాలు తెలంగాణలో..

గండేడ్/మహమ్మదాబాద్: దేశంలో ఎక్కడా లేని పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉమ్మడి మండలాలకు సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ 160 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆడపిల్లల పెళ్లి చేయాలంటే తల్లిదండ్రులు ఎన్నో ఇబ్బందులకు గురయ్యేవారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల శ్రేయస్సు కోసం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టారన్నారు. కల్యాణలక్ష్మి పథకంతో ఎంతో మంది ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థానాలకు ఎదగాలి



జిల్లా కేంద్రంలో పరీక్షా ప్యాడ్లు అందజేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు



కోటకదిరలో ..

స్టేషన్ మహబూబ్‌నగర్: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతస్థానాలకు చేరాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు మండడి సరోజ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మహాత్మా గాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా రాయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అబ్దుల్ రబ్, వాజిద్, ఆనంద్ నాయక్, మహేందర్, యాదన్న, రఘురెడ్డి, అభిలాష్‌యాదవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం పరీక్ష సామగ్రి వార్డు సభ్యురాలు హమీదా బేగం అందజేశారు. అనంతరం పది విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సలాం, హుస్సేన్, ఇనాయత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని పయనించాలని రైతుబంధు మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కోటకదిర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు.

ఎమ్మెల్సీని సన్మానించిన తపస్ నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన ఏవీఎన్ రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని శాసనమండలి ఆవరణలో తపస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, సునీల్‌కుమార్, బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఏవీఎన్‌రెడ్డిని సన్మానిస్తున్న తపస్ నాయకులు

ఇంకెన్నాళ్లు.. ఎదురు చూపులు



మాచన్‌పల్లి గ్రామ సమీపంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

ఏడు గ్రామాలకే పరిమితమైన డబుల్ బెడ్రూం ఇళ్లు

మహబూబ్‌నగర్ రూరల్: కనీసం గూడు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. మండలంలో మొత్తం 26 పంచాయతీలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వం ఏడు పంచాయతీలలో జీ ప్లస్ 1 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. ఇప్పటి పరిస్థితుల్లో తమ గ్రామాలకు ఇళ్లు వస్తాయా.. లేదా అన్న సందేహంలో ప్రజలు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇక ఇళ్ల భాగ్యం తమకు లేదా అని ఆయా గ్రామాలు ప్రజలు వాపోతున్నారు.

గృహలక్ష్మి పథకంతోనే సరి..

ఇప్పటికే పుణ్యకాలం గడిచింది. రాబోయే రోజుల్లోనైనా తమ గ్రామాలకు ఇళ్లకు బదులుగా ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకంతోనే సరిపెడతారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సొంత స్థలం ఉన్న వారికే రూ.3 లక్షలు ఇస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు సిద్ధమవుతున్నాయి. ఇదిలా ఉండగా మండలంలో ఆర్భాటంగా ప్రారంభించి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కొన్ని చోట్ల ప్రారంభమై, ఇంకొన్ని చోట్ల లబ్ధిదారుల కోసం ఎదురు చూపులుగా మిగిలాయి.

ఇళ్ల వివరాలు

ఇళ్లనిర్మాణంచేపట్టగా స్లాబ్, ప్లాస్టరింగ్ వరకు పూర్తయ్యాయి. త్వరలో ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. అదేవిధంగా చౌదర్‌పల్లిలో 32 ఇళ్లు పూర్తి దశలో ఉన్నాయి. ఫతేపూర్‌లో 40, మాచన్‌పల్లిలో 32, మాచన్‌పల్లి తండాలో 64, ఓబ్లాయిపల్లిలో 32, కోడూర్‌లో 56 ఇలా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అయితే మాచన్‌పల్లి తండాలో రికార్డు స్థాయిలో 64 పూర్తి చేయించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభం కూడా చేశారు. కానీ లబ్ధిదారుల ఎంపిక కావాల్సి ఉంది.

ప్రముఖనాయకులు ప్రాతినిథ్యం వహిస్తున్న గ్రామాలలో ఇళ్లు మంజూరు చేశారు. ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చిన కారణంగా ఆయా గ్రామాలలో పూర్తయ్యాయి. ఇదే స్థాయిలో 19 గ్రామాలలో నాయకులు లేరా, లేక అధికారులు దృష్టి పెట్టలేకపోయారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



కోడూర్‌లో నిర్మాణ దశలో ఇళ్లు

వానొస్తే గుడిసెలో.. ఎండొస్తే గుడిసె బయట



నా భర్త 16 ఏళ్ల క్రితం నన్ను వదిలేసి పోయాడు. మా గ్రామంలో ఓ చిన్నపాటి ఇల్లు ఉన్నా పైకప్పు పడిపోయేలా ఉంది. అది ఎప్పుడు కూలుతుందో తెలియదు. ఆ ఇంటి ముందు ఓ గుడిసె వేసుకొని తమ ఇద్దరు కుమారులు, కుమార్తెతో కలిసి ఉంటున్నా. మాకు జీవనాధారమే కూలీ పని. పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇల్లు కట్టిస్తామని చెబుతారు కాని ఎవరూ కట్టరు. వానొస్తే గుడిసెలో తల దాచుకుంటున్నాం. ఎండాకాలంలో గుడిసె ముందు మట్టిలోనే పడుకుంటాం.

– కప్పెర శివమ్మ, ధర్మాపూర్

రెండేళ్లుగా ఎదురుచూస్తున్నాం



అధికారులు మేము నివసిస్తున్న ప్రాంతాన్ని ఖాళీ చేయించి డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. మా స్థలాన్ని స్వాధీనపర్చుకుని రెండేళ్లు అవుతున్నా ఇప్పటికీ ఇళ్ల నిర్మాణం పూర్తికాలేదు. ప్రస్తుతం ఇతరుల స్థలంలో రేకులు వేసుకుని జీవనం గడుపుతున్నాం. గాలికి తరుచుగా రేకులు కొట్టుకుపోతున్నాయి. అయినా ఏ దిక్కులేక భార్య, పిల్లలతో కలిసి రేకుల్లోనే ఉంటున్నాం. నేను చేసే మేస్త్రీ పనితో ఇల్లు గడవడమే సరిపోతుంది. సొంతంగా ఇల్లు కట్టుకునే ఆర్థిక స్తోమత మాకు లేదు.

– రాజు, చౌదర్‌పల్లి